2లో

బడుగుల బడి కోసం రోడ్డెక్కిన మేధావులు

మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి. ఫొటోలో ప్రొ.నాగేశ్వర్, ప్రొ.లక్ష్మీనారాయణ, జెఏసి కమిటీ కన్వీనర్ ఉమామహేశ్ తదితరులు

బ్రోకర్లను ఆశ్రయించి మోసపోవద్దు

రికార్డుల ప్రకారం అధికారికంగా నిర్ధారించుకున్నాకే భూములు క్రయ విక్రయాలు చేయండి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24, ప్రభాతవార్త: 22 ఎ జాబితాలో ఉన్న భూములు,భూ భారతి రికార్డులకు సంబంధించిన భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సూచించారు. భూముల రికార్డులను సరిచేస్తామని, 22 ఎ జాబితా నుంచి భూములను తొలగిస్తామని, భూ భారతి ద్వారా భూమిపై హక్కులు కల్పిస్తామని చెబుతూ కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందుతోందని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే పేరుతో ఎవరైనా వ్యక్తులు ప్రజలను సంప్రదించి డబ్బులు అడిగితే వారి మాటలను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు పరిచయాలు ఉన్నాయని, అధికారులతో మాట్లాడి పనులు చేయిస్తామని చెబుతూ డబ్బులు వసూలు చేసే మధ్యవర్తులు, బ్రోకర్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అధికారిక రుసుములు మినహా ఎవరికి అనధికారికంగా డబ్బులు చెల్లించవద్దని సూచించారు.

భూముల వివరాలను ముందుగానే పరిశీలించాలి...

భూమిని కొనుగోలు చేసే ముందు సంబంధిత భూమికి సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా సర్వే నంబర్,భూమి విస్తీర్ణం, భూమి స్వభావం, యాజమాన్య హక్కులు, 22 ఎ జాబితాలో భూమి ఉందా లేదా, భూ భారతి రికార్డుల్లో నమోదైన వివరాలు తదితర అంశాలను సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా అధికారికంగా నిర్ధారించుకున్న తర్వాతే భూముల కొనుగోలు, విక్రయ లావాదేవీలు చేపట్టాలని తెలిపారు.భూమికి సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉన్నాయని,రికార్డుల్లో ఏవైనా సమస్యలు ఉన్నప్పటికీ తాము సరిచేయిస్తామని బ్రోకర్లు లేదా మధ్యవర్తులు చెప్పిన మాటలను నమ్మి ముందుగా డబ్బులు చెల్లించడం వల్ల ప్రజలు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకసారి డబ్బులు చెల్లించిన తర్వాత మోసపోయిన విషయాన్ని గుర్తించడం, తిరిగి ఆ మొత్తాన్ని పొందడం కష్టతరమవుతుందని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించాలి

22ఎ జాబితాలో భూమి పేరు నమోదై ఉండటం,భూ భారతి రికార్డుల్లో ఏదైనా సమస్య ఉండటం, పట్టా భూమికి సంబంధించిన వివరాల్లో తప్పులు ఉండటం వంటి అంశాలపై ప్రజలకు సందేహాలు ఉంటే నేరుగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని చంద్రారెడ్డి సూచించారు. అవసరమైన పత్రాలను సమర్పించి,అధికారికంగా తమ సమస్యకు పరిష్కారం పొందాలని తెలిపారు. భూముల రికార్డులకు సంబంధించి ఏవైనా అనుమానాలు ఉన్నప్పుడు మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి పూర్తి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములు, పట్టా భూములు, 22ఎ జాబితా, భూ భారతి రికార్డులకు సంబంధించిన అంశాల్లో అధికారిక ప్రక్రియను మాత్రమే అనుసరించాలని స్పష్టం చేశారు.

భూముల రీ సర్వే పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

వికారాబాద్, ప్రభాతవార్తః జిల్లాలో చేపడుతున్న భూముల రీ సర్వే పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సోమవారం తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలాల వారీగా రీ సర్వే ప్రక్రియ, భూ రికార్డుల పరిశీలన, సర్వే పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

గోడలు లేవు పైకప్పులు రావు

★చెంచు సాయానికి గ్రహణం ★పిల్లర్లకే పరిమితమైన గిరిపుత్రుల నివాసాలు ★కలెక్టర్ పర్యటించినా కదలని పనులు.. ★పీఎంజన్మన్ నిధులు ఖాతాల్లో పడక నిలిచిపోయిన భవనాలు ★అందని సంక్షేమం.. రూ.కోట్ల మొత్తం నుంచి అరకోటికి చేరిన బడ్జెట్ కేటాయింపులు.. ★ 20 ఏళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధి

ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి/పెద్దేముల్ : నాగరిక సమాజం వైపు అడుగులు వేస్తున్న చెంచుల అభివృద్ధికి ప్రభుత్వాలు తగినంత నిధులు కేటాయించడం లేదు. గతంలో కొండ కోనల్లో, చెంచు పెంటల్లో జన జీవనం సాగించిన చెంచులకు ఐటీడీఏ ద్వారా దండిగా నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లో జీవించే చెంచులకు మాత్రమే భారీగా బడ్జెట్ కేటాయిస్తున్నారు. నాగరిక సమాజానికి చేరువవుతున్న చెంచులను విస్మరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం ప్రాజెక్టు కింద ఉన్న చెంచు గ్రామాలకు యేటా కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వాలు ప్రస్తుతం రూ.అర కోటి కూడా మించడం లేదు. అత్యంత దుర్భరమైన జీవనం నుంచి వారు మెరుగైన జీవనం సాగిస్తున్నారంటూ పాలకులు నిధులు కేటాయించడం లేదని తెలుస్తోంది.

వికారాబాద్ జిల్లాలో 750 చెంచు కుటుంబాలు జీవిస్తున్నాయి. 23 గ్రామాలలో వారు నివాసం ఏర్పరుచుకుని వ్యవసాయమే జీవనాధారం చేసుకున్నారు. కొంతకాలం క్రితమే అధిక జనాభా గల పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామపంచాయతీగా ఆవిర్భవించింది. చెంచు కుటుంబాలే సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాన్ని పరిపాలిస్తున్నారు. వికారాబాద్, పెద్దేముల్, పూడూరు, దోమ, కులకచర్ల మండలాల్లో కలిపి 4500 మంది చెంచు జనాభా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు కింద ఈ చెంచు గూడేలు ఉండగా ప్రస్తుతం అమ్రాబాద్ మండలం మన్ననూరు ప్రాజెక్టు పరిధిలోకి వచ్చాయి. అప్పటి వరకు వెలుతురు వైపు అడుగులు పడిన చెంచుల జీవితాలు మళ్లీ అంధకారం వైపు సాగుతున్నాయని ఆవేదన వ్యక్తమవుతున్నది.

1980 నాటి భూ పంపిణీతోనే సరి

1980 తర్వాత చెంచులకు భూపంపిణీ జరుగులేదని అంటున్నారు. అప్పట్లో ప్రతి కుటుంబానికి 2 ఎకరాల ఆరు గుంటల భూములు పంపిణీ చేశారు. ఈ భూములనే సాగు చేసుకుంటున్నారు. వరి పంటనే ఎక్కువగా పండిస్తున్నారు. భూపంపిణీ చేసే నాటికి చెంచుల కుటుంబాలు చాలా తక్కువ. ప్రస్తుతం 750 కుటుంబాలు ఉన్నాయి. మరోసారి తమకు భూములు పంపిణీ చేయాలని కోరుతున్నారు. చెంచు గ్రామాలకు సమీపాన ఉన్న ప్రభుత్వ, అటవీ భూములను పట్టాలుగా ఇవ్వాలని అంటున్నారు. అంతేకాకుండా వ్యవసాయానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరుతున్నారు. 2005లో కేంద్ర, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.2.64 కోట్ల చెంచు ప్రాజెక్టు ద్వారా ఎంతగానో లబ్ధిపొందామని గుర్తు చేశారు. వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. బోరు బావులు తవ్వేందుకు ఆర్థిక సహాయం అందజేశారు. డ్రిప్ ద్వారా పంటలు పండించామని గుర్తు చేశారు. ఎద్దుల బండ్లు, ఎద్దులు, గేదెలు, కోళ్లు కూడా అందజేశారు. మళ్లీ అలాంటి పథకాలు అమలు చేయాలని అంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి చేయూత కావాలని కోరుతున్నారు. యూరియా కొరత వల్ల పంటలకు ఇబ్బంది ఏర్పడింది. కొత్తగా అమలు చేస్తున్న యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసే పరిజ్ఞానం తమకు లేదన్నారు. ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని అంటున్నారు. ఇరవై ఏండ్లుగా అలాంటి కార్యక్రమాలకు స్వస్తి పలికారు.

ఉపాధి శిక్షణకూ దూరమైన యువత

2005లోనే యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. తేనె టీగల పెంపకం, డ్రైవింగ్‌పై శిక్షణ ఇచ్చారు. యువకులు డ్రైవింగ్ నేర్చుకున్న తర్వాత వారికి డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా జారీ చేశారు. దానివల్ల పెద్ద సంఖ్యలో చెంచు యువకులు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. తేనె టీగల పెంపకం ద్వారా కొంత వరకు ఉపాధి పొందారు. ప్రస్తుతం చెంచు కాలనీల్లో తేనె టీగలు పెంపకం యూనిట్ల జాడ కనిపించడం లేదు. వ్యవసాయ పనిముట్లు కూడా పాడైపోయాయి. కొత్త పనిముట్లను అందజేయాలని అంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చెంచులకు ఆధునిక సాంకేతికతపై శిక్షణ కార్యక్రమాలు ఇప్పించాలని యువకులు కోరుతున్నారు. ప్రభుత్వ పథకాల కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అంటున్నారు.

ప్రస్తుతం పీఎం-జన్‌మన్ పథకం కింద జిల్లాలోని చెంచులకు 530 ఇండ్లు మంజూరైనాయి. అయితే, అవి అనుకున్నంత వేగమంతంగా నిర్మాణాలు సాగడం లేదు. పెద్దేముల్ మండలం చైతన్యనగర్ చెంచు గ్రామంలో ఇండ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. చెంచుల చేతుల్లో అరకొరగా ఉన్న డబ్బులు, ఇతరత్రా కారణాల వల్ల ఇండ్ల నిర్మాణాలకు అడ్డంకిగా మారాయి. దానికి తోడు పలు సాంకేతిక కారణాల వల్ల సకాలంలో దశలవారీగా బిల్లులు ఇవ్వలేకపోయారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ దృష్టికి చెంచుల ఇండ్ల సమస్య వచ్చింది. అప్పటి నుంచి అధికారుల్లో చలనం మొదలై ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇటీవల ప్రతీ ఇంటి నిర్మాణానికి లక్ష రూపాయల చొప్పున విడుదల చేసినట్లు సమాచారం. ఇంకా తమ ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. ఇండ్ల నిర్మాణాలు బేస్‌మేట్, పిల్లర్ల దశలో ఆగిపోయాయి.

కరెంట్ బిల్లుల భారం

మరోవైపు జీరో బిల్లు విద్యుత్ సరిగ్గా జరుగడం లేదని తెలిపారు. సుమారు 50 మంది చెంచులకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వాపోయారు. మిషన్ భగీరథ మంచినీటి పథకం ద్వారా సక్రమంగా సరఫరా జరుగడం లేదని తెలిపారు. బోర్ల ద్వారా నీరు వినియోగిస్తున్నారు. గ్రామానికి ఓ సామాజిక వేత్త విరాళంగా ఇచ్చిన మంచినీటి ఫిల్టర్ ద్వారా నీరు సేవిస్తున్నారు. మరో 10 మంది చెంచు రైతులకు రుణమాఫీ కాలేదని రైతు మొచ్చ పెంటయ్య తెలిపారు.

బేస్‌మెంట్లకే పరిమితమైన చెంచుల కలల సౌధం

విజయ డెయిరీ

రైతులకు ఊరట

బర్రె పాలు లీటరుకు రూ.6, ఆవు పాలకు రూ.2 పెంపు

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

షాద్‌నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విజయ డైరీ పెంచిన పాల కొనుగోలు ధరలకు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఐఏఎస్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు పెంచిన పాల ధరలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. డైరీ డెవలప్‌మెంట్ డివ్యూటీ డైరెక్టర్ హెచ్. కవిత మాట్లాడుతూ విజయ డైరీ సేకరించే పాలలో బర్రె పాలకు లీటరుకు రూ.6, ఆవు పాలకు లీటరుకు రూ.2 చొప్పున కొనుగోలు ధరలు పెంచినట్లు తెలిపారు. పెంచిన ధరలు ఆగస్టు 16వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. విజయ డైరీ ద్వారా పాడి రైతులకు ప్రతి 15 రోజులకు ఒకసారి పాల బిల్లులు చెల్లించడంతో పాటు పశువులకు బీమా, సబ్సిడీపై నాణ్యమైన పశుదాణా, గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పశువుల కొనుగోళ్ల కోసం యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు వివరించారు.

రైతులు మధ్యవర్తులు, ప్రైవేట్ డైరీలను నమ్మి మోసపోకుండా విజయ డైరీ పాల సేకరణ కేంద్రాల్లోనే పాలు విక్రయించి మెరుగైన ఆర్థిక ప్రయోజనం పొందాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ కృష్ణయ్య, కొందుర్గ్ ఇన్‌చార్జ్ మేనేజర్ హరిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాంసం తిని..మందు తాగి దర్జాగా చోరీ!

గ్రిల్ తొలగించి ఇంట్లోకి ప్రవేశం రూ. 2 లక్షల విలువైన వస్తువులు, రూ. లక్ష నగదు అపహరణ

షాద్‌నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : షాద్‌నగర్ సిఎస్కేలో గుర్తుతెలియని ముగ్గురు దొంగలు అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన నక్కల యశోద ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకున్న ముగ్గురు దుండగులు గడ్డపారతో ఇంటి గ్రిల్స్‌ను తొలగించి లోపలికి ప్రవేశించి సుమారు రూ.2 లక్షల విలువైన నగదు, వస్తువులను దోచుకెళ్లారు. బాధితురాలు నక్కల యశోద తన కుమార్తె వద్దకు మహబూబ్‌నగర్ వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు రూ.లక్ష నగదుతో పాటు ఐఫోన్, వాచ్, విలువైన టీషర్టులు, విదేశీ మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. అయితే ఇంట్లో ఉన్న ల్యాప్‌టాప్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను మాత్రం దొంగలు ముట్టుకోకపోవడం గమనార్హం. ఇక దొంగల వ్యవహార శైలి మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంట్లో ఉన్న మాంసాన్ని దర్జాగా తినడంతో పాటు అక్కడే మద్యం సేవించినట్లు ఆనవాళ్లు కనిపించాయి. అంతేకాకుండా ఇంట్లో ఉన్న విలువైన మద్యం బాటిళ్లను కూడా వెంట తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో దొంగలు కొంతసేపు ఇంట్లోనే ఉండి విందు చేసుకుని, ఆ తర్వాత దొంగతనానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో గుర్తుతెలియని ముగ్గురు దొంగలు పాలుపంచుకున్నట్లు సమాచారం. వారు ఇంట్లోకి ఎలా ప్రవేశించారు? ఎంతసేపు అక్కడ ఉన్నారు? చోరీ చేసిన వస్తువులతో ఏ మార్గంలో పరారయ్యారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది. ముఖ్యంగా పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించి, అందులో నమోదైన దృశ్యాల ఆధారంగా ఈ ముగ్గురు దొంగలను గుర్తించి పట్టుకోవాల్సిన అవసరం ఉంది.

షాద్‌నగర్ సిఎస్కే వెంచర్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశిస్తున్న దొంగ

ఎవరూ లేని ఇంటిని లక్ష్యంగా చేసుకుని గ్రిల్స్ తొలగించి లోపలికి చొరబడి, దర్జాగా తిని తాగి, విలువైన వస్తువులతో పరారైన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు త్వరితగతిన దొంగలను గుర్తించి అరెస్ట్ చేసి, చోరీకి గురైన సొత్తును బాధితురాలికి తిరిగి అందించాలని స్థానికులు కోరుతున్నారు.

డిఎస్పి కార్యాలయాన్ని తనిఖీ చేసి పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పి స్నేహా మెహ్రా

ప్రతి కేసూ వేగవంతం

శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించండి : ఎస్పి

వికారాబాద్, ప్రభాతవార్తః వార్షిక తనిఖీలలో భాగంగా వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా సోమవారం తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలోని రికార్డులు, ఫైళ్లు, కేసులకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని కేసుల స్థితిగతులను సమీక్షించారు. దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ కేసులు, సీడీ ఫైళ్లు, కోర్టు కేసులు, వారెంట్లు, దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యతతో పాటు వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని, శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించాలని, సాంకేతిక సాధనాలను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాల నియంత్రణలో భాగంగా బీట్ పోలీసింగ్, పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

శిథిలావస్థకు చేరిన భవనాలపై ఫోకస్

అంజయ్యనగర్‌లో ఏడంతస్థుల అక్రమ నిర్మాణం కూలిన ఘటనతో అప్రమత్తం

గచ్చిబౌలి, ఆగస్టు 24 ప్రభాతవార్త

అంజయ్యనగర్‌లో ఏడంతస్థుల అక్రమ నిర్మాణం కుప్పకూలిన ఘటనలో పక్కనే ఉన్న మరో రెండు భవనాలు ప్రమాదకరంగా మారడంతో హైడ్రా అధికారులు వాటిని సైతం కూల్చివేశారు. కూలిన భవనానికి ఆనుకొని ఉన్న ఓ భవనాన్ని ఆదివా రం రాత్రి నుంచి కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు సోమవారం పక్కనే ఉన్న మరో భవనాన్ని సైతం కూల్చివేశారు. ఓవైపు కూలిన భవనం శిథిలాల తొలగింపు కొనసాగుతుండగా, మరోవైపు అక్రమ నిర్మాణాల కూల్చివేత సైతం వేగంగా సాగుతుంది. సోమవారం ఉదయం అక్రమ నిర్మా ణాల కూల్చివేతలను హైడ్రా కమీషనర్ ఏవి. రంగనాథ్ పరిశీలించారు. అంజయ్యనగర్‌లో నాసిరకం నిర్మాణాలు చేపట్టి ప్రమాదకంగా మారి న 8 భవనాలను గుర్తించామని, వాటిపై త్వర లోనే చర్యలు తీసుకుంటామని హైడ్రా కమీషనర్ తెలిపారు. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నాలాను ఆక్రమించి, కేవలం 50 గజాల విస్తీర్ణంలో సాజిద్ అనే బిల్డర్ నిర్మించిన ఏడంతస్థుల నిర్మా ణం శనివారం మద్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూ లిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇద్దరు బైల్స్ కార్మికులు భవనం శిథిలాల కింద పడి మృతిచెందారు. సంఘటన జరిగిన వెంటనే హైడ్రా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధి కారులు శిథిలాల తొలగింపు చేపట్టి, చనిపోయిన వారి మృతదేహాలను బయటకు తీశారు. దీంతో పాటు కూలిన భవనం శిథిలాలు చుట్టు ప్రక్కల ఉన్న భవనాల మీద పడడంతో వాటిల్లో ఉంటున్న స్థానికులను ఖాళీ చేయించారు. అంజయ్యనగర్‌లో కూలిన భవనం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న 8 భవనాలను ఇప్పటికే గుర్తించామని, వాటిపై త్వరలోనే చర్యలు తీసు కుంటామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ తెలిపారు.

కేవలం 2 అంతస్థుల పటిష్టతతో పిల్లర్ల ని ర్మాణం చేపట్టి, వాటి మీద ఆరు, ఏడు అంత స్థుల భవనాలు నిర్మిస్తున్నారని, వాటి ద్వారా ఎప్పటికైనా ప్రమాదమేనని అన్నారు. హైడ్రా ముందుజాగ్రత్తగా ఇటువంటి వాటిని గుర్తించి కూ ల్చివేస్తున్నట్లు తెలిపారు. సీఎంసి అధికారులతో కలిసి సమన్వయం చేసుకుంటూ నగర వ్యాప్తంగా ఉన్న ఎ అక్రమ నిర్మాణాల మీద చర్యలు తీసుకుం టామన్నారు. అంజయ్యనగర్ కూల్చివేతల్లో పక్కనే ఉన్న భవనాలకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రతి చెరువు వద్దా

బేబీ పాండ్‌లు

పర్యావరణ హితంగా గణేశ్ ఉత్సవాలు

హైదరాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త:

వేడుక ఏదైనా పర్యావరణ హితంగా ఉండాలి. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా మారాలి. గణేష్ ఉత్సవాలతోనే ఇది ప్రారంభం కావాలి.. స్వాతంత్ర సంగామానికే గణేష్ ఉత్సవం ఊతమిచ్చింది. ఇప్పుడు పర్యావరణ పరిర క్షణకు కూడా తోడ్పడాలి. నగరంలో చెరువులన్నీ కాలుష్య రహితంగా మారాలి. ఆక్రమణలను తొలగించి చెరువులను హైడ్రా విస్తరిస్తోంది. మురికి కూపా లుగా ఉన్న చెరువులలో పూడికను మొత్తం తొలగించి మంచి నీటి సరస్సులుగా మార్చేందుకు హైడ్రా గట్టి ప్రయత్నం చేస్తోంది. మురుగు నీరు కలవకుండా ప్రతి చెరువు వద్ద ఎస్‌టీపీ(సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను కూడా ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో చెరువులు కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. గణేష్ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకునే ప్రతి చెరువు వద్ద బేబీ పాండ్‌లను నిర్మిస్తున్నాం. ఇలాంటి తరుణంలో నగర ప్రజలు కూడా పర్యావరణ హితమైన గణేష్ విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలి" అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ విజ్ఞప్తి చేశారు. ఉత్సవ ఊరేగింపునకు అనుగుణంగా పెద్ద విగ్రహాలు కూడా మట్టితో తయారయ్యేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సాంకేతికను అంది పుచ్చుకోవాలని.. ఆదిశగా నివుణులు ఆలోచించాలని కోరారు. ఈవిషయంలో స్వచ్ఛంద సంస్థలతో కలసి పని చేసేందుకు హైడ్రా సిద్ధంగా ఉంద న్నారు. పర్యావరణ హితమైన నగర నిర్మాణంలో ప్రభుత్వం చూపుతున్న చొరవే హైడ్రా ఏర్పాటని ఆక్రమంలోనే మట్టి విగ్రహాలపై కూడా అందరూ దృష్టి సారించాలని నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని కలిసి విజ్ఞప్తి చేశాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలిగే నష్టాలను.. మట్టి విగ్రహాలతో కలిగే లాభాలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను హైడ్రా కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్

బిసి కులగణన జరిగే వరకు పోరాటం ఆగదు

షాద్‌నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : బీసీల సమగ్ర కులగణన జరిగే వరకు పోరాటం ఆగేది లేదని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అన్నారు.

సోమవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీసీల కులగణన జరిగితేనే బీసీలకు న్యాయం జరుగుతుంది అనే నినాదంతో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ ధర్నాకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, కావలి కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రవీణ్, బచ్చలి నరేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

సుధారాణి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ వృత్తిలో సుధారాణి సేవలు స్ఫూర్తిదాయకం

షాద్‌నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : షాద్‌నగర్‌లోని జెడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా సేవలందించిన ఎం. సుధారాణి పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తూ, మార్గనిర్దేశం చేస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేసిన సుధారాణి సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో సుధారాణి అందించిన సేవలను, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయతను, సహచరులతో కలిసిమెలిసి పనిచేసిన తీరును గుర్తు చేసుకుంటూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం ఆనందం, ఆరోగ్యం, సంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుధారాణితో పాటు ప్రేమ్ రాజ్, నితిష, నిహారిక, జక్కుల జలజ, స్రవంతి రాజ్ తదితరులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధారాణి తన సేవా కాలంలో అందించిన సహకారం, ఆదరాభిమానాలను గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.

సేంద్రీయ ఎరువులనే వినియోగించాలి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మధుశేఖర్

ఘట్‌కేసర్, ఆగష్టు 24, ప్రభాతవార్త: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వేయాలని వ్యవసాయ శాస్త్రవేత్త మధుశేఖర్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ రైతువేదికలో సోమవారం ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాస్త్రవేత్త మధుశేఖర్ హాజరై మాట్లాడుతూ రైతులు హైబ్రీడ్ విత్తనాలనఉ మానుకొని రకాలను సాగుచేసుకోవాలని, పచ్చిరొట్ట పైరును ఎండాకాలంలో తప్పనిసరిగా

వరిపాలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వేసుకోవాలని సూచించారు. మైత్రి ఫామ్ సొల్యూషన్ సీఈఓ మధుబాబు మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయంతో రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. కొత్త పంట మల్బరీ సాగు వల్ల రైతులకు లాభాలు ఉంటాయని చెప్పారు. మండల వ్యవసాయాధికారిణి లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వం సిఫారసు చేసిన ఏడు సన్నరకాలకు మాత్రమే భోనస్ వస్తుందని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. అనంతరం వరిపొలాలను అధికారులు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఏఈఓ. జె.మంజుల, బిఐఎం సంతోష్, సహకార సంఘం డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, పి.బస్వయ్య, సిహెచ్.గోపాల్‌రెడ్డి, మాయ రమేశ్, మాయ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోండి: బద్దం కొండల్‌రెడ్డి

శేరిలింగంపల్లి, అగస్టు 24 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని ఆయా డివిజన్ పరిధిలో నిబం ధనలకు విరుద్దంగా,అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణలపై కఠిన చర్యలు తీసుకోవాలని మదర్ సేవా సమితి ఛైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎంసీ కమిషనర్ సృజనకు వినతిపత్రాన్ని సమర్పించారు. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ,గురుకుల్ ట్రస్ట్,ఖానామెట్,అంజయ్యనగర్, సిద్దిక్ నగర్, గోకుల్ ప్లాట్ స్ ,మాతృశ్రీనగర్ తదితర ప్రాంతాలలో 50,100 గజాల బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలపై అధికారు లు చర్యలు తీసుకోవాలని కొండల్‌రెడ్డి కోరారు. ముఖ్యంగా మాదాపూర్ అయ్యప్ప సొసైటీ,గురుకుల్ ట్రస్ట్ 300 గజాలలో సెట్ బ్యాక్ లేకుండా విచ్చలవిడిగా బహుళ అంతస్తుల అక్రమ నిర్మానాలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా ఖానామెట్,సిద్దిక్ నగర్, అంజయ్యనగర్,హఫీజ్‌పేట్,ఆదిత్యనగర్, సుబాష్ చంద్రబోస్ నగర్, భిక్షపతినగర్ తదితర ప్రాంతాలల్లో 50,100 గజాలలో ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్న వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని బద్దం కొండల్‌రెడ్డి కోరారు.

అక్రమ నిర్మాణాలపై సీయంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బద్దం కొండల్‌రెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కుల్కచర్ల,ఆగస్టు24ప్రభాతవార్త: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని పిఏసిఎస్ చైర్మన్ భీంరెడ్డి అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. శనివారం అయ గ్రామాలకు చెందిన పలువు ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందడంతోసిఎం రిలిప్ ఫండ్ చెక్కులు మంజురు అయ్యాయి స్థానిక నాయకులతో కలిసి బాధితులకు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని అన్నారు.ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రభుత్వం విద్యా, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్‌బి అధ్యక్షులు భరత్ కుమార్,వార్డు సభ్యులు వెంకటేష్, ,సినియర్ నాయకులు వెంకటయ్య గౌడ్, మాజి ఎంపిటిసి ఆనందం,సోషల్‌మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్,ఈయ గ్రామాల సర్పంచులు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో మామ,అల్లుళ్ల వార్

దాడిలో మృతిచెందిన మొగిలి

జవహర్‌నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త: జవహర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో అల్లుడితో జరిగిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో మామపై సుత్తితో దాడిచేయగా తీవ్రగాయాలపాలై మృతి చెందిన ఘటన జవహర్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాయిబాబా కాలనీకి చెందిన లింగన్నోళ్ల మొగిలి (48) ఆదివారం దోండ తోటలోని తన పెద్ద కుమార్తె ఇంటి వద్ద జరుగుతున్న బోనాల పండుగకు వెళ్లాడు. సాయత్రం 6గంటల సమయంలో బయటకు వెళ్లిన మొగిలి రాత్రి 8 గంటల సమయంలో ముఖంపై గాయాలతో తిరిగి వచ్చాడు. పొరుగు వారితో జరిగిన వాగ్వాదంతో వారు తనపై దాడి చేసినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. అనంతరం తన అల్లుడు శివతో మొగిలి గోడవకు దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో మొగిలి కిటికిలను ధ్వంసం చేయడంతో పాటు విద్యుత్ వైర్‌ను తొలగించి, శివకు చెందిన మోటార్‌సైకిల్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన శివ సుత్తితో మొగిలి తలపై రెండుసార్లు బలంగా కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొంది. తీవ్రంగా గాయపడిన మొగిలి అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. స్థానికులు జోక్య చేసుకోవడంతో శివ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మొగిలి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈఘటనపై మృతుడి భార్య లింగన్నోళ్ల అండాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలిసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్ కోసం ఉద్యమ బాట

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యత గల విద్యా బోధన అందించటానికి జవహర్‌నగర్‌లోని గబ్బిలాలపేట్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని తెలంగాణ పీపుల్స్ ప్రంట్ (టిపిఎఫ్) ఆకునూరి మురళి (ఐఏఎస్ రిటైర్డ్) డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జవహర్‌నగర్‌లోని గబ్బిలాలపేట్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయాలని, ప్రభుత్వం స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, నాయకులు, యువకులు ధర్నా నిర్వహించారు. ప్లేకార్డు పట్టి నినాదాలు చేస్తూ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షంలో తడుస్తూ జవహర్‌నగర్ గబ్బిలాలపేట్‌లో పాదయాత్ర చేసి ఆ తరువాత కలెక్టరేట్ సమీపంలోని చౌరస్తాకు చేరుకుని పాదయాత్రగా కలెక్టరేట్‌కు ర్యాలీగ చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ జవహర్‌నగర్ గబ్బిలాలపేట్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని పాఠశాలలు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ బాధ్యత వహించి పాఠశాల స్థలం సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రొ.నాగేశ్వర్ మాట్లాడుతూ గబ్బిలాలపేట పాఠశాల కోసం దీర్ఘకాలిక ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎంతో మంది పేదలు ఉన్నత విద్యకు నోచుకోవటం లేదని, వివిధ ప్రాంతాల నుంచి వలసలు వచ్చి నివాసాలు ఉంటున్న వారి పిల్లలకు నాణ్యతగల విద్యా బోదన అందించటానికి ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సేవ్ ఎడ్యుకేషనల్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొ.లక్ష్మినారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కొడుకైనా..కూలీ కొడుకైనా ఒకే పాఠశాలలో చదివే కామన్ స్కూల్ విద్యా విధానం అమలు చేయాలన్నారు. జర్నలిస్టు, సామాజిక కార్యకర్త తులసి చందు మాట్లాడుతూ ప్రభుత్వాలకు ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా గబ్బిలాలపేట్‌లో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల సాధన కమిటీ కన్వీనర్ ఉమామహేశ్ మాట్లాడుతూ గతంలో 185సర్వేనెంబరులో కేటాయించిన భూమి ప్రభుత్వానిదా..ప్రైవేట్ వ్యక్తులదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రతినిధుల బృందం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి కోకన్వీనర్ నర్సింహ్మగౌడ్, కమిటీ సభ్యులు శివన్నారాయణ, శివ బాబు, పేక్షావలి, శ్యామ్, సురేవెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు రోహమాన్, జిల్లా కార్యదర్శి అన్వర్, స్థానిక నాయకులు రాజేశ్వరి, లత, మంజుల, సుజాత, సువర్ణ, సునీత, దశరథ, కుమార్, కొమురయ్య, ఎల్లయ్య, బాబు, వెంకటేశ్, వెంకటరమణ, దుర్గేశ్, వెంకన్న, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ , ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్‌లు

ప్రజావాణికి 53 ఫిర్యాదులు

రంగారెడ్డిఅర్బన్,ఆగస్టు 24,ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక అని అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 53 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు.ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)డాక్టర్ కిరణ్మయి,అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి స్వీకరించారు.ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి,నిబంధనల మేరకు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని వారు ఆదేశించారు.ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. ప్రజలు సమర్పించే ప్రతి వినతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని,అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 26 ఫిర్యాదులు,ఇతర శాఖలకు సంబంధించి 27 ఫిర్యాదులు అందాయి. మొత్తంగా 53 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని అధికారులు పేర్కొన్నారు.సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపిడివోకు ఫిర్యాదు అందజేస్తున్న వలువురు

తాగు నీరు రావటం లేదని ఫిర్యాదు

యాచారం,ఆగస్టు24, ప్రభాతవార్త : యాచారం మండలంలోని నంది వనపర్తి గ్రామం 8వ వార్డులో నెలకొన్న తీవ్ర నీటి సమస్యను పరిష్కరించాలని వార్డు సభ్యురాలు కొండాపురం సుష్మా శ్రీశైలం కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో రాధారానికి వినతిపత్రం అందజేశారు. వార్డులో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో రోజువారీ అవసరాలకు కూడా నీరు అందక అవస్థలు పడుతున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యురాలు కొండాపురం సుష్మా శ్రీశైలం మాట్లాడుతూ.. 8వ వార్డులో కొంతకాలంగా నీటి సమస్య తీవ్రంగా ఉందని, పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని తెలిపారు. వేసవి కాలం ముగిసినప్పటికీ నీటి ఇబ్బందులు కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. తాగునీటి సమస్యతో పాటు ఇంటి అవసరాలకు కూడా సరిపడా నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

బిజెపిని మరింత బలోపేతం చేస్తాం

బేగంబజార్,ఆగస్టు24ప్రభాతవార్త: బిజెపి ఓబిసి మోర్చ జాతీయ అధ్యక్షులుగా భాద్యతలను స్వీకరించినఅమర్‌పాల్‌మౌర్యను రాజ్యసభ్యులు డాక్టర్ కె.లక్ష్మ ణ్‌తో ఓబిసి జాతీయ సోషల్ మీడియా సభ్యులు పెరిక సురేష్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబిసి వర్గాల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు పార్టీ సంస్థాగత విస్తరణకు మరింత కృషి చేస్తామన్నారు.అంకిత భావం,కష్టపడి పని చేసే వారికి బిజెపి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, ప్రభాతవార్త : ప్రజా సమస్యలు పరిష్కరించటమే అధికారుల (జిల్లా అధికార యంత్రాంగం) లక్ష్యంగా పనిచేయాలని, ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ధరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో 75ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపటం జరుగుతుందని, వాటి పరిష్కారానికి ముందుగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, జిల్లా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

ఫిర్యాదులను పెండింగ్ ఉంచకండి

వికారాబాద్, ప్రభాతవార్త : ప్రజావాణిలో స్వీకరించిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమస్యలకు సంబంధించిన 109 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. పెన్షన్, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు,, సంబందిత శాఖలకు సంబంధించి దరకాస్తు లను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబందిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్ఓ స్వర్ణలత, డీఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నందివనపర్తి ఫామ్ ల్యాండ్‌పై చర్యలు తీసుకోవాలి

యాచారం ఆగస్టు24, ప్రభాతవార్త : యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో వెలిసిన అక్రమ ఫామ్ ల్యాండ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని యాచారం మండల తహసీల్దార్ కు గ్రామానికి చెందిన పెరు మండ్ల విక్రాంత్ వినతిపత్రం సోమ వారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో తాసిల్దార్ అందజేశారు.గ్రామంలోని సర్వే నెంబర్ 581లో గతంలో ఖిశ్రీ భువి నేచర్ వ్యాలీఖి పేరుతో ఫామ్ ల్యాండ్ ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. దానికి అదనంగా నిబంధనలకు విరుద్ధంగా మరో 5 ఎకరాలు పొడిగించి అందులో రోడ్లు, డ్రైనేజీ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వెంచర్లు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని విక్రాంత్ ఆరోపించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగుతున్న ఈ అక్రమ ఫామ్ ల్యాండ్‌ను తక్షణమే తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న విక్రాంత్

కిట్లు పంపిణీ చేస్తున్న మురళీ కృష్ణ

విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ

మోమిన్‌పేట్, ఆగస్టు 24. ప్రభాతవార్త: వెల్చాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతలో భాగంగా స్టేషనరీ కిట్లు, నోట్‌బుక్స్, వైట్ బోర్డులు, కంప్యూటర్లను ఇలెన్సిస్ టెక్నాజీస్ సంస్థ ప్రతినిధులు సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఎర్ర మురళీకృష్ణ, ఇలెన్సిస్ టెక్నాలజీస్ సంస్థ సీఎస్ఆర్ టీమ్ లీడ్....మానోహర్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వ్యాయామశాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

యువత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

షాద్‌నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : యువత తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నిత్య వ్యాయామం ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన నూతన వ్యాయామశాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో యువత ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు విఠల్, సర్పంచ్ జెట్ట కుమార్, మాజీ సర్పంచ్ బండి రాజు, వ్యాయామశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కళాశాలలో తనిఖీ

కళాశాలలో తనిఖీ చేస్తున్న మానవ హక్కుల కమిషన్ సభ్యుల బృందం

షాద్‌నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని గిరిజన సంక్షేమ నివాస డిగ్రీ, పీజీ కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సీనియర్ కార్యదర్శి కార్తీక్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర సీనియర్ కోఆర్డినేటర్ ప్రణయ్ కుమార్ గౌడ్ దేవల్లి, రాష్ట్ర సీనియర్ కార్యదర్శి మనీశ్వర్ రెడ్డి చింతలపల్లి నాయకత్వంలో ప్రతినిధులు ప్రేమ్ యాదవ్, అనిల్ కుమార్ కలిసి కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థుల వసతి సౌకర్యాలు, మోలిక వసతులు, తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రత, మెస్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యతను ప్రతినిధులు పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను, విద్యా బోధన, విద్యార్థుల వసతి తదితర అంశాలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీనియర్ కోఆర్డినేటర్ ప్రణయ్ కుమార్ గౌడ్ దేవల్లి, రాష్ట్ర సీనియర్ కార్యదర్శి మనీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి సౌకర్యాలు, సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. తనిఖీ సందర్భంగా గుర్తించిన అంశాలను సమగ్రంగా నివేదిక రూపంలో రూపొందించి సీనియర్ కార్యదర్శి కార్తీక్‌రెడ్డి నాయకత్వంలో ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, వసతి, ఆహారం, మోలిక సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షి స్తామని ప్రతినిధులు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

ధర్నా చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

**వికారాబాద్, ప్రభాతవార్తఃఃః

పోచారం డివిజన్ సమస్యలను పరిష్కరించండి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 24, ప్రభాత వార్త: పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ ప్రధాన వైకుంఠధామంలో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని పలు వైకుంఠధామాల్లో తాగునీటి సరఫరా, బోర్ వెల్స్, విద్యుత్ కనెక్షన్లు, వీధి దీపాలతోపాటు అవసరమైన సౌకర్యాలను తక్షణమే కల్పించాలని కోరినట్లు తెలిపారు. పోచారం గ్రామ ప్రధాన రహదారి పనుల టెండరు పూర్తి అయినప్పటికినీ పనులు చేపట్టకపోవడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సదరు కాంట్రాక్టర్ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి కొరత ఉందని దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఇటీవల యాజమాన్య మార్పుల కారణంగా సర్కిల్ వ్యాప్తంగా ఉన్న సుమారు 300 మంది నీటి సరఫరా చేసే కార్మికుల నెలసరి జీతాలు తగ్గించారని, పెరుగుతున్న జీవన వ్యయం కారణంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి బకాయి ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాన్ని ఆలస్యం చేయకుండా జమా చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని, న్యాయబద్ధంగా పూర్తి జీతాలు అందేలా చూడాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.

పోచారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికగుప్తాకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మున్సిపల్ కమిషనర్ కొండల్ రెడ్డి.

విద్యార్థులు ఉద్యోగాన్వేషణలో మెళకువలు నేర్చుకోవాలి

కీసర, ఆగస్టు 24, ప్రభాతవార్త:

విద్యార్థులు ఉద్యోగాన్వేషణలో వివిధ రకాల మెళకువలు నేర్చుకోవాలని హాట్స్ కాలేజీ చైర్మన్ అరిమంద సిద్దార్థరెడ్డి అన్నారు.సోమవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని బోగారం గ్రామంలోని హోళీమేరీ ఇంజనీరింగ్ కలేజీలో ఆరు రోజుల పాటు నిర్వహించబడిన సిఆర్‌టి ప్రోగ్రాంను ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం జాబ్ రెడీనెస్ (ఉద్యోగానికి సిద్దం చేయడం) పెంపొందించడం,ఇండస్ట్రీ అకాడమిక్ మధ్య గల వ్యత్యాసాన్ని తగ్గించడం స్కిల్ సెట్ను డెవలప్ చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.ఆరు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌కు చెందిన ప్రతినిధి వినయ్‌రెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రీలో ఎలా మెలగాలి ఇంటి విషయాలను ఎంత ప్రాధాన్యం వహిస్తాయో తెలిపారు.ప్రతి రోజు రెండు సెషన్లుగా ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హిట్స్ కార్పొరేషన్ రిలేషన్ ఆఫీసర్ (సిఆర్ఓ) ఎన్ సామ్సన్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ ,కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వినయ్‌రెడ్డి

కండ్లకోయ-గౌడవెల్లి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

మేడ్చల్, ఆగస్టు 24, ప్రభాతవార్త : కండ్లకోయ నుంచి గౌడవెల్లి వరకు పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బీజేపీ నాయకులు మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కండ్లకోయ, గౌడవెల్లి పరిసర ప్రాంతాలకు చెందిన పాఠశాల విద్యార్థులు ప్రతిరోజూ రాకపోకల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల పాఠశాల సమయాలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 8.30 గంటలకు కండ్లకోయ నుంచి గౌడవెల్లికి, సాయంత్రం 4 గంటలకు గౌడవెల్లి నుంచి కండ్లకోయకు బస్సు సర్వీసు నడపాలని కోరారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే విద్యార్థులు సురక్షితంగా, సమయానికి పాఠశాలలకు చేరుకోవడంతో పాటు తిరిగి ఇళ్లకు చేరుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

విద్యార్థుల సమస్యను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ఆర్టీసీ అధికారులకు లేఖ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కండ్లకోయ-గౌడవెల్లి మధ్య బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని, దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి త్వరగా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరినట్లు పేర్కొన్నారు.ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్ లేఖను ఈరోజు మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు బీజేపీ నాయకులు అందజేశారు. విద్యార్థుల సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు సానుకూలంగా స్పందించి త్వరితగతిన బస్సు సర్వీసును ప్రారంభించాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ దాస్, నాయకులు మల్లికార్జున్ ముదిరాజ్, వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్దెంగూడ శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సజ్జల భువనేశ్వర్ కుటుంబ సభ్యులు

శివనామస్మరణతో మారుమ్రోగిన శివాలయం

షాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త : శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ముద్దెంగూడ, మల్లారెడ్డిగూడ గ్రామాల శివారులోగల స్వయంబుగా వెలసిన లింగమూర్తి ఆలయంలో సోమవారం గ్రామస్తులు రుద్రాభిషేకం, బిల్వార్చను ప్రత్యేకపూజలు, నిర్వహించారు. రుద్రాభిషేకం అనంతరం శివుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం. శివనామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రావణమాసంలో శివుడిని భక్తితో పూజిస్తే కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సర్పిం హులు, సబితాగోవర్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్ శివకుమార్, మాజీ సర్పంచ్ జయమ్మనుదర్శన్, సజ్జల భువనేశ్వర్, మహేశ్వర్, విశ్వేశ్వర్ జగదీశ్వర్, వెంకటయ్య, రఘునందన్ గౌడ్, మల్లిఖార్జున్, వెంకటయ్యగుప్తా, శ్రీనివాస్ గుప్తా, రాఘవేందర్ గుప్తా, సురేష్, పురుషోత్త . నర్సింహులు, సత్యనారాయణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

చేవెళ్ల ఆర్డీఓకు పెదవేడు గ్రామస్తుల ఫిర్యాదు

షాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త : జాగీర్ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ పెదవేడు గ్రామస్తులు సోమవారం చేవెళ్ల ఆర్డీఓ పార్థసింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. షాబాద్ మండల పరిధిలోని పెదవేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 2, 4, 5, 6, 7లో ఉన్న జాగీర్ భూముల్లో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టి, వాటిని అద్దెలకుఇస్తూ ఆర్థికంగాలబ్ధి పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలోని నిరుపేదలు తమకు కేటాయించిన భూములకు రక్షణగా పలకలు ఏర్పాటు చేసుకుంటే రెవెన్యూ అధికారులు వాటిని తొలగించారని గ్రామస్తులు తెలిపారు. అయితే అదే భూముల్లో కొందరు వ్యక్తులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాల్సి ఉండగా, కొందరికి ఒక రూలు.. మరికొందరికి మరో రూలు అన్నట్లుగా అధికారుల వ్యవహారశైలి ఉందని ఆరోపించారు.జాగీర్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలకు సహకరించిన అధికారులు, సిబ్బందిపై కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెదవేడు గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలని చేవెళ్ల ఆర్డీఓ పార్థసింహారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న పెదవేడు గ్రామస్తులు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 24, ప్రభాతవార్త: అంబేద్కర్ వల్ల అత్యధికంగా లాభపడిన వర్గం బీసీలు ఆర్టికల్ 340 ద్వారా సామాజిక, విద్యా, రాజకీయ అభివృద్ధికి రాజ్యాంగబద్ధమైన పునాది వేసి 27 రిజర్వేషన్‌కు మార్గం సుగమం చేశారని బహుజన నాయకులు కాలేరు శివపాల్ అన్నారు. ఈనెల 25న అంతటా బిపి మండలం యాదవ్ జయంతి ఘనంగా నిర్వహించాలని, మండల్ కమిషన్‌లోని 40 సిఫార్సులు అమలు చేసినపుడే డా.బాబాసాహెబ్ అంబెడ్కర్, బిందేశ్వరి ప్రసాద్ మండల్ యాదవ్‌కు నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకెళ్లడానికి 280వవారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎదులాబాద్ నాయకులు కాలేరు శివపాల్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శివపాల్ మాట్లాడుతూ అంబెడ్కర్ భారత రాజ్యాంగం రూపొందించటం వల్లే బహుజనులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అగ్రవర్ణాలకు పోటీ పడే విధంగా ఎదుగుతున్నారు అని చెప్పారు. మంగళవారం బిందేశ్వరి ప్రసాద్ మండల్ యాదవ్(బిపి మండల్) 109వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అతిథులు పూలదండ వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు బందారు రాందాస్, మీసాల రాజేష్ కుమార్, కడప రవీందర్, మంచాల విజయ్, బాలనగరం సురేష్‌గౌడ్, పూస అఖిల్ కుమార్, వై.సాయిబాబా, ఎం.నరేష్, బి.సాయికుమార్, ఎస్.కృష్ణంరాజు, డి.శివ కృష్ణ, లక్ష్మణ్, కె.నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్) కింద అందుతున్న సేవలపై ఆరా..

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, ప్రభాతవార్త

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని వివిధ హాస్పిటల్స్‌ను జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ సందర్శించి నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్) తో ఉద్యోగులకు, వారి కుటుంబాలకు అందుతున్న ఆరోగ్య సేవలను సంబంధిత వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా పరిధిలో ఉన్న రెమిడి ఆసుపత్రి, ఓమి ఆసుపత్రి, నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి, మెడిసిటీ ఆసుపత్రి, ఓజోన్ హాస్పిటల్స్ ఆయన సందర్శించి నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని సౌకర్యాలు, రోగుల రిజిస్ట్రేషన్లు, చికిత్సా వివరాలు, రికార్డులను డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ పరిశీలించి ఆరా తీశారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

ఘట్‌కేసర్, ఆగస్టు 24, ప్రభాతవార్త: విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహణ పనులు, పిఎంఐ పనులు, చెట్ల కొమ్మలు తొలగించే పనుల కారణంగా మంగళవారం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఘట్‌కేసర్ ఏఈఈ పవన్‌చంద్ తెలిపారు.

33/11 కెవి ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ నుండి వెళ్లే 11కేవీ హెచ్‌పిసిఎల్ ఫీడర్ పరిధిలోఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు హెచ్‌పిసిఎల్, పీబీఐటీ కళాశాల, కాలేజ్ రోడ్ చుట్టుపక్కల కాలనీలు, 33/11 కెవి కొండాపూర్ సబ్‌స్టేషన్ నుండి వెళ్లే 11కెవి అవుషాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కేపాల్, అవుషాపూర్ అన్ని కాలనీలలో కరెంట్ ఉండదని తెలిపారు. పనులు పూర్తి అయ్యాక వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈఈ కోరారు.

మోమిన్‌పేట్ ప్రజావాణిలో ఒకే ఒక్క ఫిర్యాదు ఎంపిడీఓ రాజమల్లయ్య

మోమిన్ పేట్, ఆగస్టు 24. ప్రభాతవార్త:

ప్రజావాణిలో ఒకే ఒక ఫిర్యాదు వచ్చినట్లు ఎంపీడీఓ రాజ మల్లయ్య, తహశీల్దార్ మునిరుద్దీన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి జరుగుతుందని వారు తెలిపారు. ఎంపీడీవో రాజ మల్లయ్య మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు సమస్యలు ఏమైనా ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలన్నారు.

కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేయాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, ఆగస్టు24, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ ఎవరి సొంతం కాదని, కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి పనిచేసినప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసు. శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రఘురాములును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని, ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు లేని వారు ఎవరూ లేరని, సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి వాటి ప్రయోజనాలను వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను ప్రభుత్వం గుర్తించి తగిన న్యాయం చేస్తుందని తెలిపారు.

ఒకసారి ఓటమి ఎదురైనా నిరుత్సాహపడకుండా, ఆ ఓటమిని గుణపాఠంగా తీసుకుని మరింత పట్టుదలతో పనిచేస్తే తిరిగి విజయం సాధించవచ్చని పేర్కొన్నారు.

రాజకీయాల్లో డబ్బు కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ డబ్బులతో అన్నింటినీ కొనలేమని, సంస్కారం, మంచితనం కూడా ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అనేక మందిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని, తనపై కూడా నిర్దాక్షిణ్యంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. అయితే తాను ఇప్పటివరకు నియోజకవర్గంలో ప్రతిపక్షానికి చెందిన వారినైనా, పాలకపక్షానికి చెందిన వారినైనా వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేసే రాజకీయాలు చేయలేదన్నారు.

ఒకరిని ఇబ్బంది పెట్టి పైశాచిక ఆనందం పొందడం తనకు అలవాటు లేదని, ప్రజలందరినీ సమానంగా చూసుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశం కోసం ఎంతోమంది త్యాగాలు చేశారని, వారి త్యాగాల ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో బలంగా నిలిచిందన్నారు.

సమావేశంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు సూచనలు, సలహాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఆయిల్ శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ, మహిళా సంఘం అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రఘురాములు, మాజీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, మహేష్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దశరథం, ఏఎంసీ, సింగిల్‌విండో డైరెక్టర్లు, సర్పంచులు రామ, లక్ష్మణ్, రాజు, నాయక్, రమేష్‌తో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూసార పరీక్షలతోనే స్థిరమైన వ్యవసాయం

..రాజేంద్రనగర్ ఏఓ విజయ రత్న

పెద్దేముల్, ఆగస్టు 24, ప్రభాతవార్త: నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు పంటలకు స్థిరమైన దిగుబడులు అందించాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించుకోవాలని రాజేంద్రనగర్ ఏఓ విజయ రత్న పేర్కొన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవివై)లో భాగంగా సోమవారం పెద్దేముల్ మండలం గొట్లపల్లి మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు భూసార పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ విజయ రత్న, క్లారెన్స్ వ్యవసాయ శాఖ అధికారి ఎస్.దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు భూసార పరీక్షల ద్వారా నేలలోని పోషక స్థాయిలను గుర్తించి, అవసరమైన ఎరువులను మాత్రమే సమతుల్యంగా వినియోగించుకోవచ్చని వివరించారు. అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల నేల నాణ్యత దెబ్బతినడంతో పాటు సాగు ఖర్చులు పెరిగే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థులు భూసార పరీక్షలపై అవగాహన పెంచుకొని, ఈ సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే వ్యవసాయంపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో శాస్త్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఎంఎంసి కమీషనర్‌కి వినతి పత్రం అందజేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

అసంపూర్తిగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలి

కీసర.ఆగస్టు24,ప్రభాతవార్త: నాగారం డివిజన్ 5లోని శిల్పనగర్ కాలనీలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను సూమారు 4.5 కోట్ల రూపాయలు గతంలో కేటాయించడం జరిగింది.గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 1 కోటి 50 లక్షల పనులను పూర్తి చేసి బిల్లులను కూడా డ్రా చేసుకోవడం జరిగిందని మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మారిన తరువాత పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని,నిలిచిపోయిన పనులను వెంటనే పునరుద్దరించాలని సోమవారం మల్కాజిగిరి కమీషనర్‌కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమలంఒ మాజీ జడ్పిటిసి మునుగంటి సురేష్,మాజీ కౌన్సిలర్ బిజ్జు శ్రీనివాస్‌గౌడ్,బిజేపి నాయకులు నక్క కిషోర్‌గౌడ్,రామక్కపేట రవీందర్‌రెడ్డి,సుర్వ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భోజనానికి వెళ్లి లారీ క్లీనర్ అదృశ్యం

శంషాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త :

లారీ క్లీనర్ అదృశ్యమైన ఘటన శంషాబాద్ ఫీచర్ సీటి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం...కేరళ కు చెందిన పైలకవిల్ హౌస్ వైజేష్ (40) మైసూరులోని సుందరం ట్రాన్స్‌పోర్ట్‌లో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ అభినేష్ మారాపురకల్‌తో కలిసి కేఎల్58 క్యూ 6566 నంబర్ గల లారీలో అల్లం లోడుతో మైసూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు.ఈ నెల 21న హైదరాబాద్‌లో అల్లం లోడును దించిన అనంతరం తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో ఘన్‌సిమియాగూడలోని కేరళ తమిళనాడు రోడ్ క్యారియర్స్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి వెళ్తుండగా ఘన్సీ మియాగూడ సిగ్నల్ వద్ద వైజేష్ హోటల్‌లో భోజనం చేసి వస్తానని చెప్పి లారీ నుంచి దిగాడు. అయితే ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో డ్రైవర్ అతని కోసం వెతికాడు.వైజేష్ ఫోన్‌కు చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అతని కుటుంబ సభ్యులు, తెలిసిన వ్యక్తులను సంప్రదించి ఆరా తీశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. వైజేష్ తన స్వగ్రామమైన కేరళకు వెళ్లి ఉండవచ్చని ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు.శంషాబాద్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

లారీ ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం

శంషాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త :

మామిడిపల్లి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.ఈఘటన శంషాబాద్ ఫ్యూచర్ సీటి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. కొందరు వెంకటేష్ (తండ్రి పేరు: స్వర్గీయ అర్జున్) తన స్నేహితుడికి చెందిన టీఎస్ 07 ఎం 5472 నంబర్ గల యమహా ద్విచక్రవాహనంపై మామిడిపల్లి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్నాడు. అతని వెనుక లిక్కీ కార్తీక్ రెడ్డి కూర్చున్నాడు.పాలమాకుల దాటిన తర్వాత సుమారు 200 మీటర్ల దూరంలో ముందు వెళ్తున్న వాహనాన్ని వెంకటేష్ ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఏపీ 16 టీ జే 1537 నంబర్ గల లారీ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ కిందపడిన వెంకటేష్‌పై నుంచి లారీని పోనివ్వడంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.బైక్‌పై వెనుక కూర్చున్న కార్తీక్ రెడ్డికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం లిక్కీ హేమంత్ రెడ్డి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. అప్పటికే వెంకటేష్ మృతిచెందినట్లు గుర్తించారు.ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను బ్రహ్మదేవ్ యాదవ్‌గా గుర్తించారు.

కంది పంటను కాండం కుళ్ళు నుంచి కాపాడుకోవాలి

దుద్యాల్, ఆగస్టు 24, ప్రభాతవార్త: ప్రస్తుత వర్షాలు, అధిక తేమ కారణంగా కంది పంటలో ఫైటోఫ్తోరా కాండం కుళ్ళు తెగులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని గిలిజురీ వికారాబాద్ శాస్త్రవేత్త డా. టి. రాజేశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి తులసి సూచించారు. దుద్యాల్ మండలంలోని ఈర్లపల్లి, దుద్యాల్ గ్రామాల్లో కంది పంటలను క్షేతస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంట ప్రారంభ దశలో, ముఖ్యంగా 1 నుంచి 7 వారాల మధ్య తెగులు సోకితే మొక్కలు గుంపులుగా చనిపోయే ప్రమాదం ఉందన్నారు. అధిక తేమ, వరుస వర్షాలు, పొలాల్లో నీరు నిల్వ ఉండటం, సరైన నీటి పారుదల లేకపోవడం తెగులు ఉధృతికి కారణమవుతాయని తెలిపారు

ఘనంగా లాంచ్‌ప్యాడ్‌ఎక్స్

జాతీయ ఇన్నోవేషన్ హ్యాకథాన్ 2026

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 24, ప్రభాతవార్త: పోచారం డివిజన్ పరిధిలో శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో లాంచ్‌ప్యాడ్ ఎక్స్ రెండు రోజుల జాతీయ ఇన్నోవేషన్ హ్యాకథాన్ 2026 ఘనంగా నిర్వహించారు. గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రువే మంటా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ సవాళ్లను గుర్తించి వినూత్న సాంకేతికత ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి దోహదపడుతాయని అన్నారు. విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు, సాంకేతికత నైపుణ్యం నాయకత్వం వంటి నైపుణ్యాలను ప్రదర్శించడానికి అద్భుతమైన వేదికగా హ్యాకథాన్‌నులు ఉపయోగపడతాయని అన్నారు. స్టడ్‌లైఫ్ వ్యవస్థాపకులు సిఇఒ సాయి ఈశ్వర్ పాల్గొని మాట్లాడుతూ పరిశ్రమల నిపుణులు, మార్గదర్శకులు అందించే సూచనలతో విద్యార్థులు తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తారని అన్నారు. లాంచ్‌ప్యాడ్‌ఎక్స్ విజేతకు లక్షా రూపాయల నగదు బహుమతి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివారెడ్డి, హెచ్‌వోడీ శిరీషా, అసోసియేట్ హెచ్‌వోడీ రామచంద్ర, మమత, దామోదర్, మధుకర్, హ్యాకథాన్ నిర్వాహక సమన్వయ కర్త హెచ్. బాలాజీ, వెంకన్న, మాలతి, మీరావళి, పావని,స్వాతి, నిఖిల, శ్రీనివాస రావు, సందీప్, వీరకుమార్, లావణ్య, అభిషేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్పల్లిలో ప్రజావాణి

ప్రజావాణికి తొమ్మిది దరఖాస్తులు

మర్పల్లి. ఆగస్టు 24, ప్రభాతవార్త: మర్పల్లి మండల ఎంపీడీఓ కార్యలయంలో సోమవారం నాడు నిర్వహించిన ప్రజావాణికి తొమ్మిది దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ శాంతమ్మతెలిపారు. భూసమస్యలపై 5, ఇందిరమ్మ ఇండ్లకోసం 2, పోలీస్1, నీటి సమస్య కోసం1 దరఖాస్తులు అందాయని అమె తెలిపారు. అందిన దరఖాస్తులను పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు అందివ్వడం జరిగిందని ప్రజావాణికి అందరు హాజరు కావడం జరిగిందని అమె తెలిపారు.

మండల స్థాయిలో ప్రజావాణి.. మూడు ఫిర్యాదుల స్వీకరణ

ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ సయ్యద్ ఆలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ ముంతాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీవోకు సంబంధించిన ఒక ఫిర్యాదు, రెవెన్యూ శాఖకు సంబంధించిన ఒక ఫిర్యాదు, కొత్తూరు మున్సిపాలిటీకి సంబంధించిన మరో ఫిర్యాదు కలిపి మొత్తం మూడు ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి వేదికను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

సమస్యలు బోలెడు... ప్రజావాణికి దరఖాస్తులు మూడే!

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

దుద్యాల్, ఆగస్టు 24, ప్రభాతవార్త: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో దుద్యాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అయితే మండల వ్యాప్తంగా అనేక ప్రజా సమస్యలు ఉన్నప్పటికీ ప్రజావాణిలో కేవలం మూడు దరఖాస్తులు మాత్రమే రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలు తమ సమస్యలను ఎక్కడ, ఏ శాఖకు దరఖాస్తు చేయాలి, ఎవరిని సంప్రదించాలి, సమస్యలు ఎలా పరిష్కారమవుతాయనే విషయాలపై అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంపీడీవో జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంపై మండల వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేసి, ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తే మరింత మంది తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ సుస్మిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచిత్ర, ఎంపీవో సత్యనారాయణతోపాటు రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్యా, అటవీ తదితర పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారుల తనిఖీలు

కొడంగల్,ఆగష్టు 24,ప్రభాతవార్త: కొడంగల్ పట్టణ కేంద్రంలోని వైష్ణవి ఏజెన్సీస్,రాఘవేంద్ర ఫర్టిలైజర్ ఎరువుల దుకాణాలను వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) వెంకటేవం తనిఖీ చేశారు.సోమవారం ఆయా ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువుల నిల్వలు,స్టాక్ రిజిస్ట్రర్‌లు,ధరలు,బిల్లులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులను ప్రభుత్వ నిర్దేశిత ధరలకు మాత్రమే విక్రయించాలని,తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు.అనంతరం డివిజన్ ఆఫీస్‌లో కొడంగల్ మండల ఫర్టిలైజర్ డీలర్స్ సమావేశం నిర్వహించారు.రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని తెలిపారు.ఎరువుల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే సంభందిత డీలర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఘనంగా బోనాల పండుగ

ఘట్‌కేసర్, ఆగష్టు 24, ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని ఘణాపూర్, లింగాపూర్, ఇందిరానగర్, అంకుశాపూర్‌లో ప్రజలు బోనాల ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరుకున్నారు. ఈసందర్భంగా మహిళలు మట్టికుండను పుసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి బోనాలను తలపై పెట్టుకొని డప్పుశబ్దాలు శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేధ్యం సమర్పించారు. ఘణాపూర్‌లో గ్రామదేవతలు పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, లింగాపూర్‌లో పోచమ్మ, ఎల్లమ్మ, అంకుశాపూర్‌లో ఈదమ్మ, మహంకాళీ, పోచమ్మ, కట్టమైసమ్మ అమ్మవార్లను ప్రజలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయాలను మామిడి తోరణాలు, వేపాకులు, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అంకుశాపూర్‌లో ముదిరాజ్ కులస్థులు శనివారం సాయంత్రం పెద్దమ్మ అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి సమర్పించారు. ప్రజలు బంధువులను ఆహ్వానించుకొని ఘనంగా పండుగ జరుపుకున్నారు. ఘణాపూర్‌లో యువకులు బ్యాండ్‌మేళాల మధ్య నృత్యాలు చేస్తూ పోచమ్మ అమ్మవారికి తొట్టెల ఊరేగింపు జరిపారు. ఈసందర్భంగా ఆలయాల మందు కోళ్లు, మేకలు బలిచ్చారు. బోనాల సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

మండలంలో వరుస దొంగతనాలు...

- బిక్కుబిక్కుమంటున్న గిరిజన తాండల ప్రజలు

-రాత్రి వేళ్లల్లో చోరులతో భయం -భద్రతపై ఆందోళన

కుల్కచర్ల,ఆగష్టు 24, ప్రభాతవార్త:కుల్కచర్ల మండల పరిధిలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటుండటంతో గిరిజన తండాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.పగలురాత్రనక కష్టపడి సంపాదించుకున్న సొమ్ము విలువైన వస్తువులు రాత్రికి రాత్రే దొంగల పాలవుతుండటంతో ప్రజల్లో తీవ్రఆందోళన నెలకొంది. ఇటీవల కాలంలో తండాలల్లో తాళం వేసిఉన్నఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. గతవారంలో మండలపరిధిలోని సుభ్యా నాయక్ తాండా రెండు ఇళ్లల్లో అభరణలు, నగదు దొంగలించిన విషయం తెలిసిందే...కాగా మండల పరిధిలోని రాంనగర్ గ్రామ పంచాయతీ అనుబందమైన సూర్యనాయక్ తాండలో గత మూడు నెలలుగా వరుస దొంగతనాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.గత నెలలో సూర్యనాయక్ తాండకు చెందిన కానిస్టేబుల్ మితిలాల్ ఇంట్లో 13 తులాల వెండి,బియ్యం ఇంట్లో వస్తువులు అపహరించారు.

కాగా శనివారం రాత్రి సూర్యనాయక్ తాండలో తాళంవేసి ఉన్న టీచర్ చందర్ నాయక్ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న అన్ని గాలించారు.ఎలాంటి అభరాణలు,నగదు లాభించకపోవడంతో ఇంట్లో ఉన్న రెండు బాస్మత్ బియ్యం ప్యాకెట్లు,రెండు ప్యాకెట్ల రాగుల(తైదలు) దొంగలించారు.అంతటితో ఆగకుండా అదే తాండ గోబ్రానాయక్‌ఇంటి తాళం పగలగొట్టి ఇల్లు గాలించారు.అక్కడ ఎలాంటి అభరణాలు, నగదు లభించకపోవడంతో ఇంట్లో ఉన్న కోత్త దుస్తువులు లాక్కెలారు.ముఖ్యంగా రాత్రివేళల్లో ఇళ్లకు తాళాలువేసి బయటకు వెళ్లే కుటుంబాలను గమని



స్తున్న దుండగులు అదునుచూసి చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.వరుస ఘటనలతో మహిళలు, వృద్దులు, ఒంటరిగా నివసించే కుటుంబాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.గ్రామాల్లో రాత్రి సమయంలో పోలీసుల గస్తీ పెంచాలని,అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.చోరీ ఘటనలు జరిగిన సమయంలో పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడంతో పాటు,గతంలో జరిగిన దొంగతనాల కేసులను కూడా ఛేదించి బాధితులకు న్యాయం చేయాలని తాండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.దొంగతనాల పరంపరకు అడ్డుకట్ట వేసితమకు భద్రత కల్పించాలని అధికారులను కోరుతున్నారు.తండాల్లో భద్రత పెంచి..దొంగతనాలకు చెక్ పెట్టాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

భయం భయంగా కాలం వెల్లదిస్తున్నాం.....

సూర్యనాయక్ తాండలో గత మూడు నెలలుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి.తాండలో భయం భయంగా కాలం వెల్లదిస్తున్నాం. పోలీసులు, అధికారులుమాకు రక్షణ కల్పించాలి.దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలి.సోనీ బాయి సూర్యనాయక్ తాండ.

అమ్మవారికి హరివర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

ఘట్‌కేసర్, ఆగష్టు 24, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లో మేడ్చల్ డిసిసి మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కేపీఆర్ఐటీ వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డిలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బోనాల పండుగ సందర్భంగా మేడ్చల్ జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ హరి వర్ధన్‌రెడ్డి కేపీఆర్ఐటీ కళాశాల వద్ద ఉన్న మైసమ్మ, ఎల్లమ్మ అమ్మ వార్లను దర్శించుకొని పూజలు చేయగా శాలువాతో సన్మానించారు. ఘణాపూర్ నాయకులు హరివర్ధన్‌రెడ్డికి ఘనంగాస్వాగతం పలికారు . ఈకార్యక్రమంలో మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ వేముల మమతగౌడ్, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, కొమురవెల్లి ధర్మకర్త మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు వేముల శంకర్‌గౌడ్, మండలి కృష్ణగౌడ్, నానావత్ సురేశ్‌నాయక్, గుర్జకుంట నర్సింహ్మ, డొంకెన శంకర్‌గౌడ్, నాయకులు వేముల గోవర్ధన్‌గౌడ్, బండారి మహేశ్‌గౌడ్, వేముల వెంకటేశ్, నేతాజీ యూత్ అధ్యక్షులు వేముల వినోద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్జాల్‌లో అత్యపత్య జిల్లా స్థాయి ఎంపిక

తలకొండపల్లి ఆగస్టు24,ప్రభాత వార్త:

తలకొండపల్లి మండలం వెల్జల్ గ్రామంలోని పీఎం శ్రీఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అత్యపత్య జిల్లాస్థాయి క్రీడల జట్టు ఎంపిక సన్నహాక మ్యాచ్‌లను మాజీ ఎంపీపీ, భారాస సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ వానరాశి రాములమ్మ వెంకటేష్ ప్రారంభించారు. జిల్లాస్థాయి ఎంపిక మ్యాచ్‌లను వెల్జాల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. నాలుగు రోజులు పాటు నిర్వహించి మ్యాచులకు వచ్చే క్రీడాకారులకు భోజన వసతితోపాటు క్రీడాదుస్తులు అందిస్తామని మాజీ ఎంపీపీ, భారాస సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ వానరాశి రాములమ్మ వానరాసి వెంకటేష్ తెలిపారు. ఇటీవల జరిగిన అత్యపత్య పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులు రీ. చందు, అరుణ్ తో పాటు శిదే పరమేష్‌ను సన్మానించి అభినందించారు. ఇంచార్జి హెచ్ఎం శ్రీదేవి , అత్యపత్య జిల్లా ఇంచార్జి ప్రభాకర్, విలేకరి ద్తి విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు శేఖర్, ఆదర్శ రావు, కల్పన పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా అధికారుల స్పందన లేదని ఆందోళన

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, ప్రభాతవార్త:

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని నాచారం పారిశ్రామిక వాడలో అక్రమంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసి రెండు నెలలు కావస్తున్నా అధికారులు ఇంత వరకు పట్టించుకోకపోవటం దారుణమని, మరీ ప్రజావాణి కార్యక్రమాలను ఎందుకు నిర్వహిస్తున్నట్లు అని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి (టిఎంపిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు గారె వెంకటేశ్ మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు ఆయనతో పాటు పలువురు నాయకులు విచ్చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ఇసిఐఎల్ ప్రాంతంలో కొనసాగిన ఎస్ఆర్, డిజి స్కూల్స్‌ను నాచారంలోని పారిశ్రామిక వాడలోకి (షిఫ్టింగ్) మార్చినట్లు, అదే విధంగా ఆర్ఎస్ స్కూల్స్‌ను కొత్తగా నడుపుతున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలను మార్చటం, కొత్తగా మరో పాఠశాల ఏర్పాటు చేసి నడపటంపై జూన్ 29వ తేదీన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారె వెంకటేశ్ మాదిగ వివరించారు. పారిశ్రామిక వాడలో కంపెనీలు మాత్రమే నడపాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. యాజమాన్యాలకు సహకరించే విధంగా జిల్లా విద్యాశాఖ,

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసి ఆందోళన వ్యక్తం చేసిన తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారె వెంకటేశ్ మాదిగ,పాల్గొన్న మరి కొందరి దృశ్యం

మండల విద్యా సంబంధిత అధికారులు వ్యవరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రెండు నెలల నుంచి డిఇఒ కార్యాలయం చుట్టూ, ఆర్‌జెడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారుల స్పందన లేదని ఆయన విమర్శించారు. పారిశ్రామిక వాడలో పాఠశాలలు నడుపుతున్నందున పిల్లల ప్రాణాలకు ముప్పు, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గారె వెంకటేశ్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐత సాయిలుమాదిగ, నాయకులు రాజు, ధర్మేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ సభ విజయవంతం చేయాలి

శంషాబాద్, ఆగస్టు 24,ప్రభాతవార్త : పాస్టర్స్ అసోసియేషన్ సభకు పాస్టర్స్ పెద్దఎత్తున్న తరలివచ్చి విజయవంతం చేయాలని పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.సోమవారం పలువురు అసోసి యేషన్ సభ్యులు మాట్లాడుతూ... శంషా బాద్ జోన్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ సభ మంగళవారం(నేడు) సాయంత్రం 6 గంటలకు బేగం ఇండియా ఫంక్షన్ హాల్‌లో శంషాబాద్ జోన్‌పాస్టర్ అసోసియేషన్ అధ్య క్షులు శామ్యూల్ ప్రసాద్ శావల జోసెఫ్, కమిటీ సలహాదారుడు (అడ్వైజర్) జె. ప్రశాంత్, జనరల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ దీపక్ జాన్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. శంషాబాద్ పాస్టర్ అసోసియేషన్ వివిధ గ్రామాల మండలాల పాస్టర్స్ అందరూ తప్పక పాల్గొని ఈ సభని విజయవంతం చేయాలని పాస్టర్ అసోసియేషన్ పిలుపునిచ్చారు.

విద్యావంతులైన ప్రతి ఒక్కరు మరో ఇద్దరికి విద్యా దానం చేయాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 24, ప్రభాతవార్త:

విద్యా వంతులైన ప్రతి ఒక్కరు ఇద్దరికి విద్యా దానం చేయాలని, అక్షరం లేని జీవితం వెలుగు లేని ఇల్లు లాంటిదని, అక్షరాస్యత ఒక్కరిని కాదు ఒక తరాన్నే మారుస్తుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వయోజన విద్యా డిప్యూటీ డైరక్టర్ అనిత పిలుపునిచ్చారు. సోమవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఎంఎంసి పరిధిలోని ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఆర్‌పిల సమావేశం జరిగింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదపపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ ఆదేశాల మేరకు ఉప్పల్‌లో ఆర్‌పిల సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సెప్టెంబరు 2026లో జరగనున్న ఎఫ్ఎల్ఎస్ఎటి-ఎస్ఐఒఎస్ పరీక్షల తయారీ, టిఒఎస్ఎస్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ పై చర్చించటం జరిగిందన్నారు. ఈ సమావేశం పిఒ పద్మావతి పర్యవేక్షణలో జరిగింది. ఉల్లాస్ ఆర్‌పి కరుణాకర్‌రెడ్డి, టిఒఎస్ఎస్ డిసి సత్యనారాయణ, సిఒలు పుష్ప, శ్రీధర్‌లు పాల్గొని ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యాలను సాధించే దిశగా ఆర్‌పిలను ప్రోత్సహించారు. జిల్లాలో అక్షరాస్యతను పెంపొందించటానికి ప్రతి ఒక్కరు అక్షరాస్యులుగా మారి పుస్తకాలు, పత్రికలు చదవటానికి కృషి చేయటం జరుగుతుందన్నారు.

ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన

ఘట్‌కేసర్, ఆగష్టు 24, ప్రభాతవార్త: ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఘట్‌కేసర్ ఎస్ఐ ఎ.శేఖర్ సూచించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ మేఘా కళాశాలలో డ్రగ్స్, ర్యాగింగ్, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేకత, చెడు సావాసాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, రవాణా చట్టరీత్యా తీవ్రమైన నేరమని, దీనివల్ల బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. కళాశాలల్లో ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని, సైబర్‌క్రైమ్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మేఘా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

కుల్కచర్ల,ఆగస్టు 24, ప్రభాతవార్త:మండల కేంద్రంలోని కోతుల గుట్టపై భక్తి వాతావరణం వెల్లివిరిసింది. 25 అడుగుల భారీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టపనకు గ్రామ స్థానిక నాయకులు భూమి పూజ కార్యక్రమాన్నిభక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహ

ప్రతిష్టాపనతో గ్రామానికి ఆధ్యాత్మిక శోభ చేకూరడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని గ్రామ నాయకులు తెలిపారు.విగ్రహ నిర్మాణం, ప్రతిష్టాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిం చేందుకు దతలు ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు.25 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రష్టాపనతో గ్రామానికి మరింత ఆధ్యాత్మిక గుర్తింపు అభించనుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హిందూవులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న మాదాసి కురువ నరసింహం

ఒగ్గుకథ యూనివర్స్ అవార్డు అందుకున్న మాదాసి

పెద్దేముల్, ఆగస్టు 24, ప్రభాతవార్త: పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన మాదాసి కురువ నరసింహం ఒగ్గుకథ యూనివర్స్ 2025 ఆనర్స్ రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. తెలంగాణ జానపద కళా వారసత్వంతో విశిష్ట స్థానాన్ని కలిగిన ఒగ్గు కథ కళారూపానికి, దాని కళాకారులకు గౌరవం కల్పించే ఉద్దేశ్యంతో ఒగ్గు కథ యూనివర్స్ 2025 ఆనర్స్ కార్యక్రమం యూనివర్సిటి ఆఫ్ హైద్రాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎంపికైన 25 మంది ప్రముఖ ఒగ్గు కళాకారులలో ఒకరిగా నాగులపల్లి గ్రామానికి చెందిన మాదాసి కురువ నరసింహం అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం హైద్రాబాద్ యూనివర్సిటి సావిత్రిబాయి పూలే ఆడిటోరియంలో బలగం సినిమా సుధాకర్‌రెడ్డి, హీరో విజయ్ చేతుల మీదుగా కురువ నరసింహంకు శాలువాలతో సన్మానించి సర్టిపికేట్‌తో పాటు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ సర్టిపికేట్‌తో పాటు అవార్డు తీసుకోవడం చాల సంతోషంగా ఉందని, కుమార స్వామి, రాజ్‌కుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

ఎస్ఐఆర్ కమిటీ చైర్మేన్,ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కొడంగల్,ఆగష్టు 24,ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా బీఎల్ఏలు సమర్థవంతంగా పనిచేయాలని ఎస్ఐఆర్ ట్రైనింగ్ కమిటీ చైర్మేన్,వరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.తెలంగాణా ప్రదేశ్ కాంగ్రేస్ కమిటీ అద్వర్యంలో చేపడుతున్న సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ ఫేస్=2 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,కొడంగల్ నియోజకవర్గ కాంగ్రేస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కొడంగల్ పట్టణంలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అధ్యక్షతన శిక్షణ,సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వికారాబా